ఓం‌శ్రీసాయిరాం

గాయకులారా! గానపోషకులారా! గానాభిమానులారా!

ఈ దినము సుదినము! సాధారణముగా ఉపన్యాసకులు, 'సోదర సోదరీమణులారా' అని సంబోధించుచూ, ఈ దినము సుదినమ'ని ప్రారంభింతురు. నా సంబోధనము మిమ్ములనాశ్చర్యచకితుల చేసియుండవచ్చును. ఉపన్యాసకులు అన్ని సందర్భములలోను ఈ దినము సుదినమనెదరు. అన్ని దినములు సుదినములు కావు. శ్రీ భగవానుని నామసంకీర్తనా, స్మరణ సహితములైనవే సుదినములు, తక్కినవి తద్దినములు.

లోకములో దైవభక్తి, ప్రేమ, సహన, సహకారములు సన్నగిల్లి, అశాంతి, అవినీతి, మోసము, క్రోధము, లోభము మొదలగు రాక్షస గుణములు విజృంభించి మానవులు దానవులుగా మారిన కాలములో భగవానుడు అవతారము దాల్చి ధర్మోద్ధరణమును, భక్త రక్షణమును గావించి, లోకకళ్యాణమును సమకూర్చుచున్నాడు. ఆయా కార్య గురుత్వ, లఘుత్వ బాధ్యతల ననుసరించి పరిపాలకుడు స్వయముగానో, మంత్రి సామంతుల మూలకముగనో రాజ్య పరిపాలనాది కర్మముల నెరవేర్చునట్లు, లోకేశ్వరుడైన శ్రీ భగవానుడు కూడా స్వయముగనో, నిజవిభూతుల మూలముననో లోక సంరక్షణా తత్పరుడై వున్నాడు. ఇట్టి నిత్య సూరికోటిలోని వాడే త్యాగరాజు. మున్ను వాల్మీకి మహర్షి జన్మములో శ్రీరామ కథను శ్రీమద్రామాయణ కావ్యరూపమున వెల్లడించి లోకమును శ్రీరామ భక్తిమయముగా నొనరించి, కలి మలమున కలుషితమైన దక్షిణ దేశమున మరల త్యాగరాజుగ జన్మించి, శ్రీరామ కళ్యాణగుణ వైభవమును సంకీర్తనముల ద్వారా వెల్లడించి, శ్రీరామ నామామృతమును పంచిపెట్టి, మానవోద్ధరణమును గావించెను. రోగములు వృద్ధి చెందినప్పుడు తగిన ఔషధములతో వైద్యులవసరమైన రీతి, లోకము మత్సర, ద్వేష, అశాంతులతో నిండినప్పుడు ఆయా దేశకాలోచితముగా ధర్మ స్థాపనార్థము తగిన సందేశములతో శ్రీ భగవచ్ఛక్తి యవతరించుచు శాంత్యానందముల ప్రజలకు ప్రసాదించుచుండును. ఇదియే త్యాగరాజు జన్మ రహస్యము.

త్యాగరాజు ఆంధ్ర దేశమునకు చేరినవాడయ్యును తమిళ దేశములోనే జన్మించెను. శ్రీకృష్ణుడు దేవకికి జన్మించిననూ, యశోదమ్మ ముద్దు బిడ్డడై, ఆమెకే ఆనందము గూర్చినట్లు, త్యాగరాజు తెలుగు బిడ్డయైననూ, తమిళులకు పెంపుడు కొడుకై ముద్దుముచ్చటలు గూర్చెను. వీరు కీర్తనలలో వాడిన భాష, తన భావములకు వన్నె దెచ్చెను. భావము, భావమునకు తగిన భాష, అందులకు తగిన రాగ తాళ సమ్మేళనము చేసి, అనుభూతితో సంకీర్తనము చేయుచు సర్వజనుల పరవశుల చేయుటలో త్యాగరాజు సిద్ధహస్తుడు. 24 వేల శ్లోకములతో శ్రీమద్రామాయణము రచింపబడినట్లు, 24 వేల కృతులతో శ్రీరామచంద్రమూర్తిని త్యాగరాజు కీర్తించి, తన జన్మ సందేశమును సఫలము చేసుకొనుటయేగాక, లోకుల జన్మ పావనతకు సాధనమును గూర్చెననుట సుప్రసిద్ధమే. ఆనందానుభూతికి చదువుతో నవసరము లేదు. కలిలో హరిగాన ప్రియుడైనందున, గానము ద్వారానే హరిని పొందవచ్చును. ఆనందము నందవచ్చును. గాజురాళ్లకై రత్నముల వెచ్చించినట్లు, లౌకిక సంపదను పొందుట కొరకు సంకీర్తనమును వెచ్చించ కూడదు. 'నిధి చాలా సుఖమా, రాముని సన్నిధి చాలా సుఖమా' అని పాడినాడు త్యాగరాజు. ఇచ్ఛ, శ్రద్ధ, అనుకూలత, అవకాశము, దైవానుగ్రహము లేక ఏ కార్యమును మానవుడు కొనసాగింపలేడు.

భగవదనుగ్రహము పొందుటకు జ్ఞాన, భక్తి, యోగ, కర్మములు సాధనములు. సాధకుడు ఈ నాల్గింటిలో ఏయొక్క మార్గమున గాని, కొన్నింటి ద్వారాగాని, అన్నింటి ద్వారాగాని భగవానుని పొందవచ్చును. సత్కార్యములు చేయువారిని విమర్శించుటకంటె విచారణచేసి, అట్టి సత్కార్యములకు సహాయ పడుట ధర్మము. ఇట్టి పుణ్యక్షేత్రములో శ్రీత్యాగరాజాలయము లేకపోవుట ఒక లోపమే. అట్టి లోపము లేకుండా చేయదలచి, శ్రీత్యాగరాజాలయము నిర్మాణమునకు పూనుకొనిన ఈ త్యాగరాజ భక్త మండలివారు కడుంగడు ధన్యులు. దైవభక్తి పూరితములును, ప్రేరకములునగు శ్రీత్యాగరాజ కృతులు మేటివిద్వాంసుల ద్వారా ప్రజలకు కర్ణరసాయనముగ వినిపించి, భక్తిమార్గ ప్రవిష్టులగ జేయ సంకల్పించి, ఇట్టి మహోత్కృష్ట కార్యమునకు పూనుకొన్న వీరెంతయో ప్రశంసనీయులే.

మనస్సు ఇత్తడి పాత్ర వంటిది. పాత్రను తోమనియెడల చిలుము పట్టును. అట్లే, మనస్సును నామస్మరణాదుల దినదినము నిర్మూలము చేయకుండిన చెడు త్రోవల పట్టి పతితమగును. బంగారు పాత్రను చిలుమంటనట్లు, భక్తిజ్ఞానములచే పరిపక్వమైన మనస్సు స్థితప్రజ్ఞగా మారి మోక్షానందముల చేకూర్చును. మనస్సే బంధమోక్షములకు కారణము. కాన, మనస్సును శీలించుకొనుచు దైవమార్గమునందే ప్రవేశపెట్టవలెను. ఏదైనా ఇంజనుపై డస్ట్ చేరిన రస్ట్ పట్టును. అంతట బర్స్ట్ అగును. కాబట్టి, అప్పుడప్పుడు టెస్ట్ చేయవలసి వుండును. ఇట్లే సాధకుడు తన మనస్సు పెడదారుల పట్టకుండునట్లు అప్పుడప్పుడు టెస్టు చేసుకొనుచు గమ్యమును పొందవలెను. బంధముల నుండి విముక్తిని పొందింప సాయపడువారే నిజమైన బంధువులుగాని, దేహ సంబంధ మాత్రమున బంధువులు కారు. అన్ని కార్యములందును కాయక, వాచిక, మానసికములను త్రికరణశుద్ధి వుండవలెను. సంత పకోడీలు ఘుమఘుమ వాసనల నిచ్చును. తినిన పిమ్మట రోగముల దెచ్చి పెట్టును. పేరు ప్రతిష్ఠల కొరకు జేయు కార్యము లెంతటి గొప్పవిగా కన్పించినను, తుదకు పాపకూపమునకు దారితీయును. త్యాగయ్య కృతులు సారసహితములు, సద్విషయ బోధకములు. సినీమా సంగీతము తాత్కాలికముగా సంత పకోడీల వలె శ్రోతలకు ఇంపు గూర్చిననూ పాపవిషయ బోధకములు. ఎక్కువగా త్యాజ్య విషయములతో కూడినవి. వివేకమును అభివృద్ధి చేయు చదువే విద్య యనబడును, తక్కినది అవిద్య. భక్తిని పెంపొందించునదే సంగీతము. తక్కినది ప్రొద్దు పోకడకు కులాసా పాటలు. రెండు

వైర్లు సంధించినప్పుడే వెలుగు కలుగునట్లు, హృదయావేదన, భగవదనుగ్రహము కలిసినప్పుడే సాక్షాత్కారము ఆనందానుభూతి కల్గును. శ్రీ భగవానుడు భక్త రక్షకుడు. ముందు, వెనుక, ఇరుప్రక్కలనుండి కాపాడును. ఈ సత్యము త్యాగరాజు జీవితమున గోచరించును. దొంగలు త్యాగరాజును చుట్టుముట్ట, నామధారులును ధనుర్ధరులునైన ఇరువురు సోదరులు దొంగలకు కనబడినంతనే, వారు భయభ్రాంతులై, తమ దుర్గుణముల వీడి, భక్తులైరి కదా! ఆహా! ఏమా భక్తవత్సలుని విచిత్ర చర్య. త్యాగరాజుకు కనబడకయే, దొంగలకు దర్శనమిచ్చెను. వారి పూర్వ పుణ్యము ఫలించినదేమో. మానవశరీరములోనే దైవమున్నాడు, పాపమును వున్నది. విచారణ వివేకముల ద్వారా పాపమునుండి విముక్తినంది, దైవముతో నైక్యమును పొందవలెను. నోరుకంటె చేతులు మంచివి. ఒక సత్కర్మమును ఆదర్శప్రాయముగా చేసి చూపిన, ఇతరులు అట్లే చేయుదురు.

భక్తిననుష్ఠించు మార్గదర్శకులు కావలెనుగాని, భక్తిని నుపన్యసించు వక్తలు అవసరము లేదు. సర్వ కర్మ జ్ఞానేంద్రియముల ద్వారా శివుని భజించుటయే జీవి కర్తవ్యము. వ్యర్థపు కార్యములలో మాటలలో కాలమును వ్యయపరచకూడదు. ఎల్ల వేళల సాధకుడు ఏదో ఒక భగవత్సాధనా నిష్ఠుడై వుండవలెను. సాధనలేక ఏ కార్యము సాధ్యము కాదు, రాణించదుకూడ. పట్టిన పట్టు విడువకూడదు. అప్పుడే భగవదనుగ్రహ పాత్రుడగును. అందరూ నామ సంకీర్తనా పరాయణులై జన్మసాఫల్యము పొందుదురని ఆశీర్వదిస్తూ నా ప్రసంగమును విరమిస్తున్నాను.

*11.07.1959 శనివారము సాయంత్రము 7గంటలకు తిరుపతిలో శ్రీ త్యాగరాజ మండపావరణములో భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబావారి దివ్యసందేశము.*